తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
వరంగల్ - ఆదిలాబాద్
హన్మకొండ | జనగాం | ములుగు నిర్మల్ | మంచిర్యాల
ప్రొ॥ జయశంకర్ భూపాలపల్లి కొమురం భీం ఆసిఫాబాద్
మహబూబాబాద్
శనివారం
7 ఫిబ్రవరి 2026
పేజీలు : 08

# సింగరేణిలో స్కీంలు పోయి స్కాంలొచ్చే

- అభివృద్ధి అటకెక్కే, సంక్షేమ పథకాలు పాయె
- ఎట్లుండే నా తెలంగాణ ఎట్లాయే
- మాజీ మంత్రి హరీష్ రావు ఆవేదన



**రామకృష్ణాపూర్, ఫిబ్రవరి 06(జనంసాక్షి):** కాంగ్రెస్ ప్రభుత్వంలో సింగరేణిలో స్కీంలు పోయి స్కాంలొచ్చే అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. క్యాతనపల్లి మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా స్థానిక రాజీవ్ చౌక్ లో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్నర్ సమావేశ సభలో ఆయన మాట్లాడారు. అభివృద్ధి అటకెక్కే, సంక్షేమ పథకాలు పాయె, ఎట్లుండే నా తెలంగాణ ఎట్లాయే అని ఆవేదన వ్యక్తం చేశారు. సిరుల గనిగా ఉన్న సింగరేణిలో కాంగ్రెస్ ప్రభుత్వం జోక్యంతో డీజిల్ స్కాం, 6వేల కోట్ల టెండర్ లు స్కాంతో సింగరేణి మనుగడ ప్రశ్నార్థకంగా మారే పరిస్థితి నెలకొందని, కేసీఆర్ పునరుద్ధరించిన డిపెండెంట్ ఉద్యోగాలను సీఎం రేవంత్ రెడ్డి ఊసే లేకుండా చేశారని మండిపడ్డారు. 16500 మందికి డిపెండెంట్ ఉద్యోగాలను ఇచ్చిన ఘనత కేసీఆర్ కు మాత్రమే దక్కిందన్నారు. సింగరేణిని, కార్మికులను కాంగ్రెస్ ప్రభుత్వం ఆగం చేస్తుంటే కార్మిక మంత్రిగా ఉన్న చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ ఎందుకు నోరు మెదపడటం లేదని ప్రశ్నించారు.

### రెండేళ్ల పాలనలో రాష్ట్రం ఆగం..

గడిచిన రేవంత్ రెడ్డి రెండేళ్ల పాలనలో రాష్ట్రం ఆగమైందని, ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీ హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. మహాలక్ష్మి పథకంలో మహిళలకు 2500 రూపాయలు, కళ్యాణ లక్ష్మి తో పాటు తులం బంగారం, 4వేల రూపాయల పెన్షన్లు, ఇందిరమ్మ ఇళ్లు ఇలా ఇచ్చిన హామీలను, చేసిన స్కాంలని ప్రశ్నిస్తే డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మండిపడ్డారు. కేసీఆర్ హయాంలో నాట్ల నాట్లకు రైతు బంధు ఇస్తే రేవంత్ హయంలో ఓట్లకు రైతు బంధు ఇస్తున్నారని ఎద్దేవాచేశారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలను మోసం చేసి గద్దెనెక్కిన రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి మున్సిపల్ ఎన్నికలు గుణపాఠం కావాలని, క్యాతనపల్లి మున్సిపాలిటీ అభివృద్ధి కొరకు కలిసి వచ్చిన సిపిఐ పార్టీతో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు పోటీ చేస్తున్న అన్ని స్థానాల్లో బారి మెజార్టీతో గెలిపించాలని కోరారు..

### మున్సిపాలిటీలను 200 కోట్లతో అభివృద్ధి చేస్తా.. : మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్..

క్యాతనపల్లి మున్సిపాలిటీ ఎన్నికల్లో బిఆర్ఎస్ జెండా ఎగిరితే వచ్చే అసెంబ్లీ ఎన్నికలో ఎమ్మెల్యేగా గెలిచిన ఆరు నెలల్లోనే క్యాతనపల్లి, చెన్నూరు మున్సిపాలిటీల అభివృద్ధికి 200 కోట్ల రూపాయల నిధులను తీసుకొస్తానని మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ హామీ ఇచ్చారు. మున్సిపల్ ఎన్నికల హడావుడితోనే నియోజకవర్గంలో మంత్రి అభివృద్ధి పేరిట శంకుస్థాపనలు చేశారని ఆరోపించారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలోనే ఆర్వోబి పనులు 90శాతం పూర్తి అయ్యాయని గుర్తుచేశారు. కన్నీరు పెడుతున్న క్యాతనపల్లికి పూర్వ వైభవం రావాలంటే బిఆర్ఎస్ సీపీఐ కలిసి పోటీ చేస్తున్న 22 స్థానాలలో అభ్యర్థులను బారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

### కాంగ్రెస్ నుండి సింగరేణి కాపాడుకుందాం : ఏఐటియూసి రాష్ట్ర అధ్యక్షులు సీతారామయ్య..

కాంగ్రెస్ నుండి సింగరేణి కాపాడుకోవాల్సిన సమయం వచ్చిందని ఏఐటియూసి రాష్ట్ర అధ్యక్షులు సీతారామయ్య అన్నారు. ప్రభుత్వం నుండి సింగరేణికి రావాల్సిన వేల కోట్ల రూపాయలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. క్యాతనపల్లి మున్సిపాలిటీలో మంత్రిగా ఉన్న వివేక్ చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. సింగరేణి క్షేత్రంగా ఉన్న క్యాతనపల్లి అన్ని మిగతా 7లో..



## బ్యాలెట్ పేపర్ల ముద్రణ, వెరిఫికేషన్‌ను పరిశీలించిన కలెక్టర్

**ఆదిలాబాద్ ప్రతినిది, (జనంసాక్షి):** రాబోయే ఎన్నికల నేపథ్యంలో బ్యాలెట్ పేపర్ల ముద్రణ, వెరిఫికేషన్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ రాజర్షి షా శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. స్థానిక జడ్పీ కార్యాలయంలోని ముద్రణాలయం, స్ట్రాంగ్ రూమ్ వద్ద జరుగుతున్న ఏర్పాట్లను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బ్యాలెట్ పేపర్ల నాణ్యత, అక్షర దోషాలు లేకుండా ముద్రణ జరుగుతున్నదా, భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నారా అనే అంశాలను కలెక్టర్ నిశితంగా పరిశీలించారు. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు చోటుచేసుకోకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ప్రతి దశను నిబంధనలకు అనుగుణంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ తనిఖీలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, డీఆర్డీఏ రవీందర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## 11న పరకాల మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో సెలవు

- హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్



**హనుమకొండ ప్రతినిధి జనవరి 6 (జనం సాక్షి) :** పరకాల మున్సిపాలిటీ ఎన్నికలలో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుటకు గాను ఈనెల 11వ తేదీన జరగనున్న పోలింగ్ రోజున స్థానిక సెలవు గా ప్రకటిస్తూ హనుమకొండ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ స్నేహ శబరీష్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ సూచన ప్రకారం కలెక్టర్ కు కల్పించబడిన అధికారాల మేరకు జిల్లాలోని పరకాల మ్యూనిసిపాలిటిలో పోలింగ్ జరిగే ఈ నెల 11వ తేదీన ప్రభుత్వ, సంస్థల ఉద్యోగులకు, సాధారణ సెలవు, ఎన్నికల ప్రాంతంలో ఉన్న షాపులు సంస్థలు ఫ్యాక్టరీల్లో పనిచేస్తున్న ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోలింగ్ రోజున వేతనంతో కూడిన సెలవు కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రైవేట్ సంస్థల్లో పనిచేస్తున్న కార్మికులకు వేతనంతో కూడిన సెలవుగా ప్రకటించినట్లు తెలిపారు. ఎన్నికల నిర్వహణకు ఉపయోగించే ప్రభుత్వ భవనాలు విద్యాసంస్థల భవనాలకు ఈనెల 10వ తేదీన (మంగళవారం) పోలింగ్ కు ముందు రోజు, 11వ తేదీన (బుధవారం) పోలింగ్ రోజు, 13వ తేదీ (శుక్రవారం ) ఓట్ల లెక్కింపు తేదీల్లోసెలవును ప్రకటించినట్లు పేర్కొన్నారు. అందుకు తగు చర్యలు తీసుకోవాల్సిందిగా సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కావున ఓటర్లు తప్పకుండా తమ విలువైన ఓటును

## బిఆర్ఎస్ పార్టీ నాయకులు అక్రమంగా సంపాదించిన డబ్బుతో ప్రజల మధ్యకొస్తారు మోసపోకండి

- పని చేసే బాధ్యత నాది ఆశీర్వదించే బాధ్యత మీది..
- ఎమ్మెల్యేగా నేనున్న అభివృద్ధి చేసేదే చెప్తా చెప్పేదే చేస్తా



**నర్సంపేట ఫిబ్రవరి 6 ( జనం సాక్షి) :** నర్సంపేట మున్సిపాలిటీ ఎన్నికల ప్రచారంలో భాగంగా నేడు నర్సంపేట లోని పలు వార్డ్ లలో విస్తృతంగా పర్యటించి,ఎన్నికల ప్రచారం నిర్వహించిన ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి శుక్రవారం మాట్లాడుతూ. ప్రజల ఆశీర్వాదంతో అభివృద్ధి సంక్షేమానికి మరింత ముందుకు తీసుకెళ్ళేందుకు కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇవ్వాలని ఆయన కోరారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ చేతి గుర్తుకు ఓటు వేసి, అభివృద్ధిలో భాగ్యస్వాములు కావాలని,అభివృద్ధికి అండగా ఉండాలని మునిసిపాలిటీ ప్రజానీకాన్ని కోరారు. గత పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో నర్సంపేట మున్సిపాలిటీలో నర్సంపేట పట్టణ అభివృద్ధిని పట్టించుకోలేదని,పట్టణంలో ఒక్క డబుల్ బెడ్ రూమ్ ఇల్లు,ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని గత ప్రభుత్వ తీరుపై,తీవ్రస్థాయిలో విరుచుపడ్డారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నర్సంపేట మున్సిపాలిటీ అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ ఉంచి, మున్సిపాలిటీలోని సమస్యలను గుర్తించి రోడ్లు, తాగునీరు,డ్రైనేజీలు వ్యవస్థను మెరుగుపరచామని,ఇటీవల కోట్ల నిధులతో మున్సిపాలిటీ లో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేసుకున్నామని అన్నారు. మీ అందరి ఆశీస్సులతో మున్సిపాలిటీ లోని 30కి,30స్థానాలు గెలుచుకుని, నర్సంపేట మున్సిపాలిటీపై కాంగ్రెస్ జెండాను ఎగరవేస్తామని ఆయన పేర్కొన్నారు .

# ఆశీర్వదించండి అభివృద్ధి చేస్తా

### బాసాని దయాకర్ విస్తృత ప్రచారం



**పరకాల, ఫిబ్రవరి 6 (జనం సాక్షి):**పరకాల మున్సిపల్ ఎన్నికల్లో 9వ వార్డు కాంగ్రెస్ పార్టీ బల పరిచిన అభ్యర్థి బాసాని దయాకర్ విస్తృతంగా ఇంటింటి ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఎన్నిక ల్లో తనకు ఓటేసి గెలిపిస్తే వార్డును ఆదర్శ వార్డు గా తీర్చిదిద్దుతానని తెలిపారు.అధికార పార్టీతోనే పరకాల పట్టణం అభివృద్ధి జరుగుతుందని, ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి ఆశీస్సులతో వార్డులోని మౌలిక సదుపాయాలు సిసి రోడ్లు, డ్రైనేజీ, నీటి సమస్యలు ప్రజల సంక్షేమం కోసం పాటు పడతానని తెలిపారు. వార్డు ప్రజలకు సేవ చేసేందుకే వచ్చానని తనను ఆదరిస్తే అభివృద్ధి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో తొమ్మిదవ వార్డు ఎన్నికల ఇన్చార్జి కందకట్ల నరహరి, వార్డు అధ్యక్షుడు దార్న వేణుగోపాల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మల్లన్న దేవుని ఆలయ నిర్మాణానికి వినతిపత్రం అందజేత



**కాళేశ్వరం , ఫిబ్రవరి 07 , ( జనం సాక్షి)** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మం డలం మద్దులపల్లి గ్రామపంచాయతీ పరిధిలో గోదావరి తీరాన వెలసిన మల్లన్న దేవుని ఆలయానికి నిధులు మంజూరు చేసి ఆలయ నిర్మాణం చేపట్టాలని మద్దు లపల్లి సర్పంచి సరిత, ఉపసర్పంచి లచ్చిరెడ్డి తెలంగాణ రాష్ట్ర దేవదాయ ధర్మాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్ కు వినతిపత్రం అందజేశారు. సరస్వతీ అంత్య పుష్కరాల పనుల ప్రతిపాదనలకై కాళేశ్వరం వచ్చిన తెలంగాణ రాష్ట్ర దేవదాయ ధర్మాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజా రామయ్యర్ ను ఆలయ కార్యనిర్వహణ అధికారి కార్యాలయం వద్ద మద్దులపల్లి సర్పంచ్ సరిత, ఉపసర్పంచ్ లచ్చిరెడ్డి లు మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్ సానుకూలంగా స్పందించి దేవాదాయశాఖ డిఈ రమేష్ కు ఆలయానికి సంబంధించిన వివరాలు చూడాలని ఆదేశించారు. సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు సర్పంచి సరిత తెలిపారు.

## సీఎం కప్ కోకోలో కొప్పూరు జట్టుకు ప్రథమ బహుమతి



**భీమదేవరపల్లి:ఫిబ్రవరి06 (జనం సాక్షి)**హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండల కేంద్రంలో ఈ నెల 2వ తేదీన ప్రారంభమైన సీఎం కప్ కోకో టోర్నమెంట్లో కొప్పూరు గ్రామానికి చెందిన కోకో జట్టు ప్రథమ బహుమతిని గెలుచుకుంది.ఈ సందర్భంగా శు క్రవారం కొప్పూరు గ్రామ సర్పంచ్ గద్ద కుమారస్వామి, ఉపసర్పంచ్ మిర్యాల రాణి రాజు, పంచాయతీ కార్యదర్శి రత్నకుమారి చేతుల మీదుగా విజేత జట్టుకు సీల్డ్ కోకో బహుమతిని అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ గద్ద కుమారస్వామి మాట్లాడుతూ, కొప్పూరు గ్రామ కోకో జట్టు సీఎం కప్లో మూడోసారి ప్రథమ బహుమతి సాధించడం గ్రామానికి ఎంతో గర్వకారణమని అన్నారు.క్రీడాకారులు నైపుణ్యంతో పాటు క్రమశిక్షణను కూడా పాటించాలని సూచించారు.కోకో జట్టు కెప్టెన్ మాట్లాడుతూ,గ్రామ సర్పంచ్ తమ క్రీడాకారులను నిరంతరం ప్రోత్సహిస్తూ అవసరమైన డ్రెస్సులు, క్రీడా పరికరాలు అందించడం వల్లే ఈ స్థాయిలో విజయం సాధించగలిగామని తెలిపారు.ఈ సందర్భంగా కోకో జట్టు సభ్యులు సర్పంచ్ను శాలువాతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు తూముల చిరంజీవి, కారోబార్ తాళ్లపల్లి మల్లయ్య,తుమ్మల రాజమౌళి,గడపే ప్రశాంత్తో పాటు కోకో జట్టు సభ్యులు గడిపే రాజేందర్,గడిపి అర్జున్,షాడమాకి భాస్కర్,కదిరే సతీష్, తూముల రణధీర్,బైరి శ్రీమన్,కొమ్ముల సాగర్,గడిపి ఆంజనేయులు, మిర్యాల గణేష్,గడిపే విశాంత్,మాట్లరఘు, బాకీ డేవిడ్, గుడి కందుల అశ్విత్ తదితరులు పాల్గొన్నారు.

# పరకాల పట్టణ అభివృద్ధి కాంగ్రెస్ తోనే సాధ్యం

### ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి



**పరకాల, ఫిబ్రవరి 6 (జనం సాక్షి):**పరకాల పట్టణ అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డిఅన్నారు .శుక్రవారం పరకాల మున్సిపాలిటీ ఎన్నికలలో భాగంగా 1,2,10,11,13 వార్డులలో టిపిసిసి ఉపాధ్యక్షులు దొమ్మటి సాంబయ్య, మాజీ ఎమ్మెల్యే మొలుగూరి బిక్షపతి తో కలిసి పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి ఇంటింటా ప్రచారాన్ని నిర్వహి ంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించుకొని పరకాల పట్టణ అభివృద్ధికి తోడ్పడుదాం అన్నారు. కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించడానికి పట్టణ ప్రజలు సిద్ధంగా ఉన్నారని, టిఆర్ఎస్ బిజెపి నాయకుల మోసపూరిత మాటలను నమ్మవద్దని అన్నారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి గెలిపించుకుంటే, పట్టణానికి మరిన్ని నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేస్తానన్నారు. పట్టణాన్ని మోడల్ మున్సిపా లిటీగా తీర్చిదిద్దుతున్నామని ఒక ప్రత్యేకమైన డిపిఆర్ వ్యవస్థతో సిసి రోడ్, డ్రైనేజీ వ్యవస్థ, త్రాగునీరు, మరిన్ని వసతులతో అభివృద్ధి చేస్తున్నామన్నారు.గత బిఆర్ఎస్ ప్రభుత్వ పాలకులు అభివృద్ధి సంక్షేమం పేరుతో దోచుకున్నారని, కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు.200 యూనిట్ల ఉచిత విద్యుత్,500 రూ గ్యాస్ సిలిండర్, రెండు లక్షల లోపు రైతు రుణమాఫీ, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, సన్న బియ్యం పంపిణీ, మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు తదితర సంక్షేమ పథకాల అందిస్తున్నామని తెలిపారు.

# బిఆర్ఎస్ జిమ్మిక్కులు పని చేయవు

### మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి



**రామకృష్ణాపూర్, ఫిబ్రవరి 06(జనంసాక్షి):** చెన్నూరు నియోజకవర్గంలో బిఆర్ఎస్ నాయకులు ఎన్ని జిమ్మిక్కులు చేసిన పని చేయవని రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 3, 4, 19, 20 వార్డులలో శుక్రవారం మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా పాల్గొని ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిం చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సింగరేణి లాభాలను గణనీయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పెంచితే, గత బిఆర్ఎస్ ప్రభుత్వం సింగరేణి సొమ్మును వాడి కార్మికులకు నష్టాన్ని మిగిలించిందని ఆరోపించారు. నియోజకవర్గంలో నిరుద్యోగులకు ఇచ్చిన మాట ప్రకారం ఉద్యోగ అవకాశాలను కల్పించడానికి స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లో సరైన శిక్షణ ఇప్పించడం జరుగుతుందని త్వరలోనే అనుకూల డిపార్ట్మెంట్ లలో ఉద్యోగాలను కల్పిస్తామని మరోసారి హామీ ఇచ్చారు. కాంగ్రెస్ తోనే క్యాతనపల్లిలో అభివృద్ధి సాధ్యమని ప్రజలు విశ్వసిస్తున్నారన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించి క్యాతనపల్లి మున్సిపాలిటీని మరింత అభివృద్ధి చేయడానికి అవకాశం ఇవ్వాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షుడు రఘునాథ్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు పల్లె రాజు, అభ్యర్థులు మంతెన మల్లమ్మ, రామగిరి శ్రీనివాస్, గాండ్ల వీణ - సమ్మయ్య, కూతురు ప్రభాకర్, నాయకులు యాకుబ్ అలీ, కొక్కుల సతీష్, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల విజయవంతానికి సమన్వయం కీలకం




### జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజార్షి షా

**ఆదిలాబాద్ ప్రతినిధి, (జనంసాక్షి):**మున్సిపల్ సాధారణ ఎన్నికలు 2026 నిర్వహణలో భాగంగా ప్రిసైడింగ్ అధికారులు పీ ఓ లు అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు ఏ పి ఓ ల కోసం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన శిక్షణా కార్యక్రమం జిల్లా కలెక్టర్, హాజరై మార్గదర్శకాలు అందించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల నిర్వహణలో క్షేత్రస్థాయిలో పీ ఓ, ఏ ఓ ల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రంలో జరిగే ప్రతి అంశానికి ప్రిసైడింగ్ అధికారి పూర్తి బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను క్షుణ్ణంగా అధ్య యనం చేసి నిష్పక్షపాతంగా, పారదర్శకంగా పోలింగ్ నిర్వహించాలని ఆదేశించారు. బ్యాలెట్ బాక్సుల నిర్వహణ, మాక్ పోలింగ్ నిర్వహణ, పోలింగ్ అనంతరం పత్రాల భద్రతలో ఏమాత్రం నిర్లక్ష్యం ఉండ కూడదని సూచించారు. పోలింగ్ రోజున ముందుగానే కేంద్రాలకు చేరుకుని సన్నద్ధంగా ఉండాలని, చిన్న పొరపాటు కూడా ఎన్నికల ప్రక్రియపై ప్రభావం చూపుతుందని హెచ్చరించారు. అత్యవసర పరిస్థితులు లేదా సాంకేతిక సమస్యలు తలెత్తిన వెంటనే సెక్టార్ అధికారులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. శిక్షణలో భాగంగా అధికారుల అవగాహనను పరీక్షిం చేందుకు 50 ప్రశ్నలతో ప్రశ్నపత్రం నిర్వహించారు. ఇందులో ప్రతిభ కనబర్చిన అధికా రులకు, కలెక్టర్ వారిని శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, మాస్టర్ ట్రైనర్ లక్ష్మణ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# బుర్ర శ్రీనివాస్ గౌడ్ కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి



.( జనం సాక్షి.). **06.02.26.గోవిందరావుపేట**కల్లుగీత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సమరభేరి మోగించాలని కెవిపిఎస్ ములుగు జిల్లా కార్యదర్శి బుర్ర శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండలంలోని రాంపూర్ తాటి వనంలో కళ్ళు గీత కార్మిక సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శ్రీనివాస గౌడ్ హాజరై క్యాలెండర్ ఆవిష్కరించి మాట్లాడారు.కల్లుగీత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 17న చలో ఇంద్ర పార్క్ నిరాహార దీక్ష లను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం కల్లుగీత కార్మికులకు అనేక హామీలు ఇచ్చిందని రెండు సంవత్సరాలు పూర్తయిన ఇప్పటివరకు ఒక హామీ కూడా నెరవేర్చక పోవడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. ఈమూడు సంవత్సరాల పెండింగ్ లో ఉన్న ఎక్స్ గ్రేషియా లను మరియు తాడి కార్పొరేషన్ చెక్కులను కూడా తక్షణమే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఏజెన్సీ ఏరియాలో రద్దు చేసిన సొసైటీల విషయంపై ముఖ్యమంత్రి స్పందించి సొసైటీలను పునరుద్ధరణ చేయాలని అన్నారు.గత మూడు సంవత్సరాలుగా 50 సంవత్సరాల నిండిన కల్లుగీత కార్మికులకు పెన్షన్ సైట్ ఓపెన్ చేయకుండా పెన్షన్ రాకపోవడంతో గీతా కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రతి గీత కార్మికునికి టూ వీలర్ బైక్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పది లక్షలు ఎక్స్ గ్రేషియా జీవో తక్షణమే విడుదల చేయాలని వారు అన్నారు. కల్లు గీత కార్మికుల సమస్య ల పైన ప్రభుత్వనిర్లక్ష్యం ను నిరసిస్తూ ఈ నెల 17నచలో ఇంద్ర పార్క్ నిరాహార దీక్ష పెట్టడం జరిగిందని అప్పటికి ప్రభుత్వం తీర్చకపోతే చలో అసెంబ్లీ కార్యక్రమం చేపడతామని అన్నారు.ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు జక్కు రాజు గౌడ్ మండల ఉపాధ్యక్షులు మేరుగు సుధాకర్ గౌడ్ , గండు రాంబాబు గౌడ్ పూజారి సారంగం గౌడ్ బుర్ర వెంకన్న గౌడ్ బొమ్మగాని షణ్ముఖ గౌడ్ జక్కు మొగిలి గౌడ్ కక్కెర్ల శ్రీనివాస్ గౌడ్ పంజాల ఉదయ్ కుమార్ గౌడ్ తోపాటు 15 మంది పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించండి: కుచాడీ శ్రీహరి రావ్



**నిర్మల్ బ్యూరో, ఫిబ్రవరి06, (జనంసాక్షి)**మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని నిర్మల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ కుచాడీ శ్రీహరి రావ్ పిలుపునిచ్చారు. శుక్రవారంమున్సిపల్ ఎన్నికల ప్రచారం లో భాగంగా నిర్మల్ పట్టణం లోని 40 వ వార్డు అభ్యర్థి అడప విజయలక్ష్మి పోశెట్టి గెలుపు కోసం నిర్మల్ కాంగ్రెస్ ఇంచార్జి కుచాడి శ్రీహరి రావ్ కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాల చారి  పీసీసీ ప్రధాన కార్యదర్శి అంబడి రాజేశ్వర్ లు ఇంటింటి ప్రచారం చేపట్టారు. చింతకుంట వాడా, సోమక్షత్రియ సంగం ఏరియా, సునార్గల్లి, బంజాయిండ్లు, పాత కష్బా స్కూల్ ఏరియా లలో ఇంటింటా విస్తృత ప్రచారం చెప్పటారు,అనంతరం 31 వార్డులో దర్మాజీ గారి శ్రీనివాస్ ను గెలిపించాలని ఇంటి ఇంటికి వెళ్ళి ప్రచారం చేశారు. ప్రభుత్వం చేపడ్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను వివరిస్తూ ఓటు వేయాల్సిందింగా కోరారు. ఈ ప్రచార కార్యక్రమం లో ఎర్రవోతి రాజేందర్, అడప పోశెట్టి, అడప గణేష్, కొట్టె శేఖర్ పత్తి విగ్న తేజ, ఎంబడి రాకేష్, పెద్ద ఎత్తున మహిళలు ఆయా వాడకట్టు ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు..

## కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడండి

### ఐఎఫ్టీయూ జిల్లా అధ్యక్షుడు తాళ్లపల్లి శ్రీనివాస్



**బెల్లంపల్లి, ఫిబ్రవరి 6, (జనంసాక్షి)**కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని ఐఎఫ్టీయూ జిల్లా అధ్యక్షుడు తాళ్లపల్లి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శుక్రవారం బెల్లంపల్లి పట్టణంలో ఈనెల 12న తలపెట్టిన సార్వత్రిక సమ్మె పోస్టర్లను విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మోడీ నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం కార్మికులకు వ్యతిరేకమైన నాలుగు లేబర్ కోడులను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నాలుగు లేబర్ కోడ్లు కార్మికులకు ఉన్నటువంటి హక్కులను కాలరాయడం తప్ప కార్మిక వర్గానికి ఉపయోగకరంగా లేవని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్లను ఇప్పటికే కేరళ, పశ్చిమ బెంగాల్ లాంటి రాష్ట్రాలలో తిరస్కరించినారని అన్నారు. కార్మిక వర్గానికి, అసంఘటిత కార్మికులకు, వివిధ రంగాల వారికి ఈ లేబర్ కోడ్లు కట్టు బానిసలుగా తయారు చేయడానికి, ఉన్న హక్కులను కాలరాయడానికి మాత్రమే ఉపయోగపడతాయని అన్నారు. ఇలాంటి చట్ట వ్యతిరేకమైన లేబర్ కోడ్లను తక్షణమే రద్దు చేయాలని, ఈనెల 12న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మిక వర్గం పాల్గొని సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్టీయూ నాయకులు వెంకటి, కృష్ణవేణి, సురేష్, వనిత, రాజేశ్వరి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# పట్టణాభివృద్ధికి నిధుల వరద పారిస్తా

### బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్



**బెల్లంపల్లి, ఫిబ్రవరి 6, (జనంసాక్షి)**బెల్లంపల్లి పట్టణాభివృద్ధికి నిధుల వరద పారిస్తానని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. శుక్రవారం బెల్లంపల్లి పట్టణంలోని 30, 31, 32, 29, 4 వార్డులలో నిర్వహించిన మున్సిపల్ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణాభివృద్ధికి నిధుల కొరత ఉండదని, బెల్లంపల్లి పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసే బాధ్యత తనదేనని స్పష్టం చేశారు. ప్రజల అవసరాలను గుర్తించి, మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తామన్నారు. బెల్లంపల్లి నియోజకవర్గంలో ఇప్పటికే రూ.19 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులను ప్రారంభించానని, 200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులను ప్రారంభించనున్నామని అన్నారు. రాబోయే రోజుల్లో బెల్లంపల్లి నియోజకవర్గాన్ని రూ.500 కోట్లతో సమగ్రంగా అభివృద్ధి చేస్తానని ప్రకటించారు. గత పదేళ్లు పాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజల సమస్యలను పట్టించుకోలేదని ఆరోపించారు. గత పాలనలో ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డులు ఒక్క లబ్ధిదారునికి కూడా అందలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేద ప్రజలకు ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత కరెంటు, కొత్త రేషన్ కార్డులు అమలు చేస్తున్నామని చెప్పారు. మున్సిపల్ ఎన్నికలు ప్రజల భవిష్యత్తును నిర్ణయించేవని, ప్రజల సమస్యలపై అవగాహన కలిగిన, ప్రజల మధ్యే ఉండే నాయకులే గెలవాలన్నారు. ప్రజలంతా కాంగ్రెస్ పార్టీ చేతి గుర్తుకు ఓటు వేసి, తమ తమ వార్డులలో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో 30వ వార్డ్ కౌన్సిలర్ అభ్యర్థి గెల్లి విజయలక్ష్మి, 31వ వార్డ్ కౌన్సిలర్ అభ్యర్థి గెల్లి సంధ్య, 32వ వార్డ్ కౌన్సిలర్ అభ్యర్థి నీలి హారిక, 29వ వార్డ్ కౌన్సిలర్ అభ్యర్థి మేడి పున్నం చందు, 4వ వార్డ్ కౌన్సిలర్ అభ్యర్థి పంగ శాంత, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, తాజా మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను అఖండ మెజారిటీతో గెలిపించాలి



### రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు

### అల్లూరి కృష్ణవేణి

**నిర్మల్ రూరల్,ఫిబ్రవరి6(జనంసాక్షి)**మున్సిపల్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను అఖండ మెజారిటీతో గెలిపించాలని తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షురాలు అల్లూరి కృష్ణవేణి తెలిపారు.మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం పట్టణంలోని 4వ వార్డ్ బంగాల్పేట్ కాలనీలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పెండం శ్రీనివాస్ ను గెలిపించాలని ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా కృష్ణవేణి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాల కాలంలో నిర్మల్ పట్టణం ఎంతో అభివృద్ధి చెందిందని,అధికార పార్టీ అభ్యర్థులు గెలిస్తే పట్టణం మరింత అభివృద్ధి చెందుతుందని ఆమె తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణలో200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్ తో పాటు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ,ఇందిరమ్మ ఇల్లు,తదితర కార్యక్రమాలను చేపట్టిందని తెలిపారు. నిర్మల్ పట్టణం అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని ఆమె  కోరారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సోమ భీమ్ రెడ్డి,మహాలక్ష్మి ఆలయ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ ,మహిళా నాయకులు పరమకుశం ,వాసవి ,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## ప్రకృతి సేద్యంతో ఆదాయం, ఆరోగ్యం

### వ్యవసాయ అధికారి సృజన



**బెల్లంపల్లి, ఫిబ్రవరి 6, (జనంసాక్షి)**ప్రకృతి వ్యవసాయం చేస్తే సవజానికి ఆరోగ్యాన్ని పంచడంతో పాటు రైతులకు తగిన ఆదాయం లభిస్తుందని బెల్లంపల్లి నియోజకవర్గం నెన్నెల మండల వ్యవసాయ అధికారి సృజన అన్నారు. శుక్రవారం ఆమె మండలంలోని నందుల పల్లి గ్రామంలో ప్రకృతి సేద్యంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈస ందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం పంట మార్పిడి చేస్తూ సేంద్రియ ఎరువులు వాడాలన్నారు. పంట వేసే ముం దు పచ్చిరొట్ట ఎరువులు, జీలుగ, కానుగ, వేప ఆకులు వేసి కలియ దున్ని పంటలు సాగు చేస్తే మంచి దిగుబడి వస్తుందన్నారు. అధిక మోతాదులో యూరియా వాడకంతో భూసారం తగ్గి పంటలు, పంట దిగుబడి తగ్గుతాయన్నారు. ఆహార భద్రత పథకంలో పథకం లో భాగంగా 50 శాతం సబ్సిడీ పై పంపిణీ చేసేందుకు ట్రైకోడర్మ విరిడె, భాస్వరాన్ని కరిగించే బ్యాక్టీరియ అందుబాటులో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి షైని, నందులపల్లి సర్పంచ్ కామెర వనిత శంకర్, ఉప సర్పంచ్ ఠాకూర్ గజేందర్ సింగ్, రైతులు పాల్గొన్నారు.

## బాసర ఆలయ హోంగార్డ్ రోడ్డు ప్రమాదంలో మృతి

బాసర, ఫిబ్రవరి 06 (జనం సాక్షి) బాసర ఆలయ హోంగార్డ్ వెంకటరమణ (45) విధినిర్వహణలో శుక్రవారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మృతుడు 15 సంవత్సరాలుగా ఆలయ హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న సందర్భంలో గోదావరి ఘాట్కు వెళ్తున్న సమయంలో సమీప పెట్రోల్ బంకు దగ్గర బొలెరో వాహనం ఢీకొనడంతో ఘటన స్థలం వద్దనే మృతి చెందాడు. ఎన్నో ఏండ్లుగా ఆలయంలో హోంగార్డుగా విధులు నిర్వహించి ఇటు భక్తులకు అటు గ్రామస్తులకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి అందరి మన్ననలు పొందిన వెంకటరమణ ఆత్మీయుడు  కావడంతో ఇటు ఆలయ సిబ్బంది అటు గ్రామస్తులు శోకసంద్రంలో మునిగిపోయారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# గ్రామాల సమగ్ర అభివృద్ధి తమ ప్రధాన లక్ష్యం

### పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ భూమి పూజ



**ముధోల్, ఫిబ్రవరి 06 (జనం సాక్షి)** గ్రామాల సమగ్ర అభివృద్ధి తమ ప్రధాన లక్ష్యమని ముధోల్ ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్ అన్నారు.శుక్రవారం ముధోల్ మండలంలోని బ్రహ్మన్ గావ్ గ్రామంలో రూ.40 లక్షల నిధులతో పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణానికి, అలాగే మహిళా సమైక్య సంఘ భవన నిర్మాణానికి రూ.10 లక్షల నిధులతో భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు.అదేవిధంగా గన్నోర గ్రామంలో రూ.40 లక్షల నిధులతో పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణానికి, ఎడ్ బిడ్ గ్రామంలో మహిళా సమైక్య సంఘ భవన నిర్మాణానికి రూ.10 లక్షల నిధులతో భూమి పూజ నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థులకు భద్రత లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ప్రహరీ గోడ నిర్మాణంతో వారికి పూర్తి రక్షణ కలుగుతుందని తెలిపారు. అలాగే మహిళా సమైక్య సంఘ భవనాల ద్వారా మహిళలు ఆర్థికంగా, సామాజికంగా అన్ని రంగాల్లో ముందుండాలని ఆకాంక్షించారు.విద్యా రంగం మరియు మహిళా సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమాల్లో సర్పంచులు, మండల నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# క్రీడా స్థలం ఏర్పాటుకు సహకరించాలి



**మంగపేట ఫిబ్రవరి 06 (జనంసాక్షి)**మండలంలో అనువైన క్రీడా మైదాలు లేక యువత క్రీడల్లో పూర్తిస్థాయిలో రాణించలేకపోతున్నారని అందుకు మండల కేంద్రంలో క్రీడా మైదానాన్ని ఏర్పాటు చేయాలని శుక్రవారం మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయంలో తహసిల్దార్ తోట రవీందర్ కు యువకులు వినతి పత్రాన్ని అందజేశారు. మండలంలోని యువత అనువైన క్రీడా మైదానాలు లేక యువత క్రీడల్లో పూర్తిస్థాయిలో రాణించలేక సతమతమవుతున్నారని అందుకు యువతకు చదువుతోపాటు క్రీడలు కూడా ఎంతో ముఖ్యమని ఎంతోమంది మహనీయులు చెప్తూనే ఉంటున్నారు. కానీ అందుకు అనువైన క్రీడామైదానాలు లేక యువత క్రీడల్లో రాణించలేకపోతున్నామని స్పోర్ట్స్ కోటాలో వివిధ శాఖలలో ఉద్యోగ అవకాశాలు ఉన్నా కూడా వాటిని కోల్పోతున్నామని వారన్నారు. మండలంలోని యువత వాలీబాల్, కబడ్డీ, క్రికెట్, ఇంకా వివిధ క్రీడల్లో మండల స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు కూడా వెళ్లిన వారు ఉన్నారని అలాంటివారికి క్రీడా మైదానాలు ఉంటే మరింత ఉన్నత స్థానాలకు వెళ్లే అవకాశాలు ఉన్నాయని వారన్నారు. ఈ విషయంపై ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు ప్రత్యేక చొరవ చూపి మండల కేంద్రంలో అనువైన క్రీడా మైదానాన్ని ఏర్పాటు చేయవలసిందిగా వారు కోరారు. కార్యక్రమంలో యడ్లపల్లి సాయిరాం, చల్ల శ్రీహరి, రాంకీ, హేమంత్, నాగేందర్, నరేష్, జయంత్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి ):**ఈ నెల 8న సీఎం రేవంత్ రెడ్డి గణపురం మండలం చెల్పూరు గ్రామ శివారులో నిర్వహించతలపెట్టిన భారీ బహిరంగ సభకు రానున్న నేపథ్యంలో, అట్టి సభకు సంబంధించిన ఏర్పాట్లను శుక్రవారం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పరిశీలించారు. హెలీ ప్యాడ్, వాహనాల పార్కింగ్, విద్యుత్, మంచినీరు తదితర విషయాలపై అధికారులతో చర్చించారు. వేదిక ఏర్పాటు పనులను స్పీడప్ చేయాలని సూచించారు. భూపాలపల్లి నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుండి పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ నేతలు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కోరారు.



# ఆత్మ విశ్వాసంతో విద్యార్థులు తమ లక్ష్యాన్ని చేరుకోవాలి

### మంచిర్యాల డీఈవో ఎస్.యాదయ్య

### పదో తరగతి విద్యార్థులకు అవగాహన



**కాసిపేట, ఫిబ్రవరి 6 :(జనం సాక్షి )** ఆత్మ విశ్వాసంతో విద్యార్థులు తమ లక్ష్యాన్ని చేరుకోవాలని జిల్లా విద్యాధికారి ఎస్. యాదయ్య సూచించారు. శుక్రవారం కాసిపేట మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్ లో కాసిపేట ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో మండలంలోని అన్ని పాఠశాలలకు చెందిన పదో తరగతి విద్యార్థులకు ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు, మోటివేషనల్ స్పీకర్ ప్రకాష్ బణావత్ ద్వారా అవగాహన సదస్సును నిర్వహించారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కంటం తిరుపతి ఆధ్వర్యంలో గౌరవాధ్యక్షులు చెట్టి శ్రీధర్ సభా అధ్యక్షతన అవగాహన నిర్వహించిన కార్యక్రమానికి డీఈవో ఎస్.యాదయ్య ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు సమయపాల పాటించి కాలం విలువైనదిగా గుర్తించి నేటి పని రేపటికి వాయిదా వేయకుండా క్రమ శిక్షణతో వ్యవహరించాలన్నారు. లక్ష్యమే గమ్యంగా ముందుకు వెళ్లి పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని సూచించారు. ఈ అవగాహన సదస్సులో ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు, మోటివేషనల్ స్పీకర్ ప్రకాష్ బాణావత్ విద్యార్థులు పది పరీక్షల్లో తీసుకోవాల్సిన అంశాలపై క్షుణ్ణంగా వివరించారు. ఒత్తిడిని అధిగమించి, ఆశావాదంతో ఉండడం, ఆత్మవిశ్వాసం పెంపొందడ, జయించడం, వ్యక్తిత్వ వికాసం సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థుల ఆలోచన సరళని మార్చి, ఆత్మ విశ్వాసాన్ని పెంచి లక్ష సాధన ప్రోత్సహించే విధంగా అవగాహన కల్పించారు. ప్రతికూల పరిస్థితుల్లో కూడా ఆశావాహ దృక్పథంతో ఉండడం, పట్టుదలతో ప్రయత్నం కొనసాగించడం వలన విజయం సాధ్యమవుతుందని వివరించారు. విద్యార్థులకు ఆసక్తికరంగా బోధించడం పట్ల విద్యార్థులందరూ ఆకర్షణతో విన్నారు. అనంతరం ప్రముఖులకు శాలువాలతో సన్మానించిన మెమోటోలు అందించారు. అనంతరం విద్యార్థులు అందరికీ ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో ముక్తవరం వెంకటేశ్వర స్వామి, జిల్లా కోఆర్డినేటర్ మూర్తి, ఓరియంట్ క్రెడిట్ సొసైటీ చైర్మన్ అట్టెపల్లి శ్రీనివాస్, డిప్యూటీ రేంజర్ ప్రవీణ్ నాయక్, జిల్లా గర్ల్ చైల్డ్ స్పెషల్ ఆఫీసర్ విజయ లక్ష్మీ, ప్రిన్సిపాల్ ఖలీల్, హెచ్ఎం సాంబమూర్తి, బండ శాంకరి, నాగమల్లయ్య, అరుణ, క్లబ్ అధ్యక్షులు కంటం తిరుపతి, గౌరవాధ్యక్షులు చెట్టి శ్రీధర్, జనరల్ సెక్రటరీ కూకట్ల రాజేష్, కౌశాధికారి లడ్డూరి రమేష్, సలహాదారులు ఎరుకల లింగ స్వామి, టంగుటూరి రవి రాజ్, సభ్యులు గంధం దినేష్, అలుగం సురేష్,మోతిరాం, ఆంకార్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల విధులను సమర్ధవంతంగా నిర్వహించాలి

### వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద

### వర్ధన్నపేటలో ఎన్నికల శిక్షణ కార్యక్రమం



**వరంగల్ బ్యూరో, ఫిబ్రవరి 06 (జనం సాక్షి)**మున్సిపల్ ఎన్నికల విధులను పీఓ, ఏపీఓలు సమర్థవంతంగా నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ సత్య శారద అన్నారు. శుక్రవారం వర్ధన్నపేట రైతు వేదికలో మున్సిపల్ ఎన్నికల పీఓ,ఏపీఓలకు ఏర్పాటు చేసిన ఎన్నికల శిక్షణ కార్యక్రమానికి కలెక్టర్ హాజరై మాట్లాడారు. మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో పారదర్శకంగా, స్వేచ్ఛాయుతంగా ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహించేందుకు ప్రిసైడింగ్ అధికారుల పాత్ర చాలా కీలకమైనదన్నారు. ఎన్నికలకు సంబంధించి డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో ఇచ్చే మెటీరియల్, బ్యాలెట్ బాక్స్ ల సీలింగ్ ప్రిసైడింగ్ అధికారుల డైరీ, బ్యాలెట్ పేపర్ అకౌంట్ ఏజెంట్ల సమక్షంలోనే బ్యాలెట్ బాక్సులను తెరవడం, తర్వాత ఉదయం 7 గంటలకు పోలింగ్ స్టార్ట్ చేయడం తదితర అంశాలపై కలెక్టర్ పీఓ, ఏపీఓలకు వివరించారు.పోలింగ్ సామాగ్రి స్వీకరణ నుండి పోలింగ్ ముగిసే వరకు ప్రతి విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఓటర్లకు సౌకర్యవంతమైన వాతావరణం కల్పించడంతోపాటు అన్ని సదుపాయాలు కల్పించాలన్నారు. ఎన్నికల నియమ నిబంధనలను పాటిస్తూ ఎన్నికల ప్రక్రియ మొత్తం నిష్పక్షపాతంగా జరగాలని తెలిపారు.ప్రతి రెండు గంటలకు ఒకసారి పోలింగ్ శాతం టీ పోల్ లో అప్‌లోడ్ చేయాలని, పోలింగ్ కేంద్రంలోకి వాటర్ బాటిళ్లు, బ్యాగ్, మొబైల్, ఇంక్ ప్యాడ్ వంటివి అనుమతించవద్దని అన్నారు. 100 మీటర్ల అవతల వెహికల్స్ పార్కింగ్ చేసుకోవాలని, పోలింగ్ కేంద్రం వద్ద మెడికల్ టీమ్స్, వీల్ చైర్, అంగన్‌వాడీల సహాయకులు ఉంటారని తెలిపారు.అనంతరం మునిసిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. కేంద్రంలో పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ నిర్వహణ కలెక్టర్ పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు .అదేవిధంగా ఎన్నికల నిర్వహణకు వినియోగించే బ్యాలెట్ బాక్సులు, సీల్స్, బ్యాలెట్ పేపర్లు తదితర ఎన్నికల సామగ్రిని కూడా కలెక్టర్ పరిశీలించారు. ఎన్నికల సామగ్రి భద్రత, సరైన నిల్వ, రవాణా ప్రక్రియలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సంబంధిత అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో ఆదనవు కలెక్టర్ సంధ్యారాణి, ఆర్డీఓ సుమా, తహసీల్దార్ విజయ్, మునిసిపల్ కమిషనర్ సుదీర్ కుమార్, మాస్టర్ ట్రైనర్లు శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్యాలు సాధించని వారిపై చర్యలు డీఆర్ డీఓ

**కౌటాల ఫిబ్రవరి 06 జనం సాక్షి..**మండల కేంద్రం లో గల సూర్య చంద్ర మండల సమాఖ్య లో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి (డీఆర్‌డీఓ) దత్త రావ్ సందర్శించారు. కౌటాల క్లస్టర్‌కు చెందిన చింతలమానే పల్లి, కౌటాల, బెజ్జూర్ మండలాలకు చెందిన సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్ డీఓ మాట్లాడుతూ మహిళా సంఘాల ఆర్థికాభివృద్ధికి బ్యాంకు లింకేజ్, శ్రీనిధి రుణాల లక్ష్యాలను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. లక్ష్యాలు సాధించని వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.అలాగే నిరక్షరాశులైన మహిళలకు “అమ్మకు అక్షరమాల” కార్యక్రమం ద్వారా చదువు నేర్పించాలని సూచించారు.ఈ సమావేశంలో డీపీఎంలు, ఏపిఎంలు, సీసీలు, వివోఏలు, ఎమ్మెస్ ఓ బి లు పాల్గొన్నారు.



## విద్యుత్ సమస్యను పరిష్కరించిన సర్పంచ్

**కాళేశ్వరం , ఫిబ్రవరి 07 , ( జనం సాక్షి ).** జయ శంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవ్పూర్ మండలం మద్దులపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని ఎస్సీ కాలనీలో ఏర్పడిన విద్యుత్ సమస్యను గ్రామ సర్పంచి సరిత విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనికి స్పందించిన విద్యుత్ శాఖ అధికారులు అక్కడ రెండు కరెంట్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా సమస్య పరిష్కారానికి సహకరించిన మహదేవ్పూర్ ఏఈ శ్రీకాంత్‌కు మరియు లైన్ ఇన్స్పెక్టర్ సదానందం, ఏఎల్ఎం రాజు, వెంకటికి గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.



# రోజుకో రూపాయితో రూ.8 కోట్ల స్కూల్ బిల్డింగ్

**గోవిందరావుపేట (జనంసాక్షి):** చదివించాలనుకున్నారు వాళ్ళంతా. కానీ, వాళ్ళంతా సగటు మహిళలే. కార్పొరేట్ స్కూళ్ళకు పంపే ఆర్థికస్తోమత లేదు. కానీ, ఎలాగైనా సరే....పిల్లల్ని అలాంటి స్కూల్లోనే చదివించాలన్న పట్టు మాత్రం విడిచిపెట్టలేదు. 'వేరే బళ్ళో ఎందుకు? మనమే ఒక స్కూలు పెట్టేస్తే ఎలా ఉంటుంది? అనుకున్నారు. దాన్ని చేతల్లో చూపించారు. కార్పొరేట్ స్కూళ్ళకు ధీటుగా ఓస్కూల్ ను నిర్మించారు ఆంధ్రాలోని కర్నూలు జిల్లా మహిళలు. మహారాజా ప్యాలెస్ లా కన్పిస్తున్న ఈ బిల్డింగ్ స్కూలు. రూపాయి రూపాయి పోగు చేసి, ఇటుకా ఇటుకా పేర్చి....చెమటోడ్చి కట్టుకున్న భవనం. డ్వాక్రా పొదుపు మహిళలు తమ శ్రమశక్తితో నిర్మించుకున్న ఈ భవంతికి ఎంతో చరిత్ర ఉంది. ఎంతో ప్రత్యేకత ఉంది. ఒక్కమాటలో చెప్పాలంటే....అక్షరం ముక్క కూడా రాని 10 వేలమంది పొదుపు మహిళల ఎనిమిదేళ్ల శ్రమశక్తితో ఈ బిల్డింగ్ రూపుదిద్దుకుంది. మెల్లమెల్లగా రెండంతస్తులు పూర్తి చేసుకుని, మూడో అంతస్తు నిర్మాణాన్ని కూడా త్వరలో పూర్తి చేసుకోబోతోంది. తమకు ఎలాగూ చదువులేదు. కనీసం పిల్లలకైనా చదువు చెప్పిస్తే, వాళ్ళ బతుకులు బాగుపడతాయని అనుకున్న మహిళల ఆలోచనే ఈ భవంతికి పునాది. ఈ చరిత్ర తెలుసుకుంటే....ఓ అద్భుతం చూసినట్టే ఉంటుంది. 1995లో ఓర్వకల్లు మండలం హుశేనాపురంలో ఒక్కో సంఘంలో పది మంది చొప్పున రెండు డ్వాక్రా పొదుపు సంఘాలు ఏర్పడ్డాయి. ఆర్థికంగా ఒక్కో మెట్టు ఎదగడం ప్రారంభించాయా సంఘాలు. వీరి స్ఫూర్తి మండలంలోని 22 గ్రామాలకు పాకింది. మండలంలోని అన్నిగ్రామాల్లో దాదా పు వెయ్యిసంఘాలు ఏర్పడి పదివేలమంది



సభ్యులుగా చేరారు. రోజుకో రూపాయి చొప్పున పొదుపు చేసుకుంటూ 8 కోట్ల రూపాయలు పోగుచేశారు. ఒక పక్క వాళ్ళు డెవలప్ అవుతూనే మరోపక్క పొదుపు సంఘం కూడా డెవలప్ అయ్యేటట్టు చూసుకున్నారు. 10 వేల మంది కలిసి పోగుచేసిన ఈ 8 కోట్ల రూపాయల్ని బ్యాంకు ఖాతాల్లో ఉంచకుండా, సంఘంలోని సభ్యులకే తక్కువ వడ్డీకి అప్పులుగా ఇచ్చారు. అలా వడ్డీ రూపంలో మరో ఐదున్నర కోట్ల రూపాయలు వచ్చింది. వీరి పొదుపు స్ఫూర్తిని చూసిన బ్యాంకర్లు స్వయం ఉపాధి ఏర్పాటు చేసుకునే మహిళలకు 70 కోట్ల రపాయల మేర అప్పులిచ్చారు. దీంతో ఓర్వకల్లు మండల సమాఖ్య టర్నోవర్ దాదాపు 84 కోట్ల రపాయలకు చేరుకోవడంతో, వారే సొంతంగా ఓ మహిళా బ్యాంకును ఏర్పాటు చేసుకున్నారు. 2008 లో వచ్చిన ఒక ఆలోచన ఈ మహిళల శక్తికి పెద్ద పరీక్షే పెట్టింది. 2008 లో ఓర్వకల్లు పొదుపు గ్రామైక్య సంఘం ఆఫీసు పక్కనే ఉన్న చిన్నగదుల్లో స్కూల్ ను మొదలుపెట్టారు. పొదుపు మహిళలందరినీ ఏకతాటిపైకి తెచ్చి ప్రోత్సహించిన సమాఖ్య గౌరవ సలహాదారు విజయభారతి పేరు మీదనే తమ స్కూల్ కు 'బాలభారతి' అని పేరు పెట్టుకున్నారు. ఈ స్కూలుకు సొంత భవనం ఏర్పాటు చేసుకోవాలని టార్గెట్ పెట్టుకున్నారు. మామూలు స్కూళ్ళలా కాకుండా కార్పొరేట్ స్కూళ్ళకు దీటుగా ఉంటేనే తమ పిల్లలు పైకొస్తారనుకుని పెడితే అలాంటి స్కూలే పెట్టాలనుకున్నారు. ఈ కల ఒక్కరోజులో నిజం కాలేదు. ఎనిమిదేళ్ళు పట్టింది. చివరకు కార్పొరేట్ స్కూల్ తరహాలోనే మంచి స్కూల్ ఏర్పడింది. సొంతంగా బ్యాంకు ఏర్పాటు చేసుకున్న ఆత్మవిశ్వాసం, చేతిలో డబ్బా ఉండడంతో ఆ స్కూలుకు సొంత బిల్డింగ్ ఏర్పాటు చేయాలనుకున్నారు. అక్కడితో ఆగలేదు. 'సంకల్పం ఉంటే చాలు, ఏదీ అసాధ్యం కాదు' అని రుజువు చేశారు కూడా. ఓర్వకల్లుకు కిలోమీటరు దూరంలో ఏడెకరాల స్థలాన్ని కొనుక్కున్నారు. బిల్డింగ్ ప్లాన్స్ రెడీ చేసుకుని, తరువాత స్కూలు భవంతికి వాళ్ళే కూలీలయ్యారు. పునాదులు తవ్వడం మొదలు ఇటుకలు, సిమెంటు, ఇసుక మోస్తూ.. తమ కుటుంబాలతో కలసి ఎనిమిదేళ్ళుగా శ్రమించారు. తామే కూలీలుగా.. మేస్త్రీలుగా మారిపోయారు. ఏ ఒక్కరూ రూపాయి కూలీ తీసుకోలేదు. వంతుల వారీగా శ్రమదానం చేస్తూ, నిర్మాణాన్ని చాలావరకు పూర్తి చేశారు.మూడంతస్తుల్లో, సువిశాలమైన 60 క్లాసు రూములు కడదామనుకున్నారు. ఇప్పటికి 40 క్లాసు రూములు కట్టడం పూర్తి చేశారు. మిగిలిన 20 గదులను కూడా రేపో మాపో పూర్తి చేయబోతున్నారు. అలాగే మూడెకరాల్లో సువిశాల మైదానాన్ని కూడా ఏర్పాటు చేసుకుని ఆట వస్తువులను కూడా సమకూర్చుకున్నారు. నిర్మాణం పూర్తి చేసుకున్న రూముల్లో క్లాసులు నడుస్తున్నాయి. ఫర్నీచర్ క్వాలిటీతో ఉండేలా చూశారు. కారిడార్లు కానీ, స్కూల్లో మిగతా ప్లేసెస్ కానీ ఆకర్షణీయంగా తీర్చిదిద్దుకున్నారు. పిల్లల యూనిఫామ్ కూడా స్టయిలిష్ గా ఉంటుంది. స్కూలుకి బస్సులు కూడా ఉన్నాయి. విద్యావేత్తల సలహాలు, సూచనలతో పూర్తిగా క్వాలిఫైడ్ టీచర్లను నియమించుకున్నారు. సీసీ కెమెరాలు, మైక్ సిస్టమ్ కూడా ఏర్పాటు చేసుకున్నారు.పొదుపు మహిళలు దాచుకున్న సొమ్ము 7 కోట్ల రూపాయలతో కార్పొరేట్ స్థాయిలో కట్టిన ఈ స్కూల్ భవంతి నిర్మాణంలో పాలు పంచుకున్న వారంతా పొదుపు మహిళలు, వారి భర్తలు.. ..ఇతర కుటుంబసభ్యులే. పూర్తిగా తమ పొదుపు మొత్తాల నుండి సేకరించిన డబ్బుతో కట్టారిది. ఒక పక్క రాజకీయ నాయకులు అందరూ తమ తమ అధికారం కోసం స్వలాభాల కోసం బూతు పురాణాలు కులాలు మతాలు అని కొట్టుకు చస్తుంటే వీరు మాత్రం అదేమి మాకు పట్టనట్లు చరిత్ర సృష్టించి భావితరాలకు ఆదర్శంగా నిలిచారు... ఐకమత్యమే మహా బలం అని నిరూపించిన సంఘటన.


## సీపీఎఫ్ ఆధ్వర్యంలో స్వయం సహకార సంఘాల మహిళలకు శిక్షణ

**ఫీల్డ్ ఫెసిలెటర్ శృతి**



**చెన్నారావుపేట, ఫిబ్రవరి 6 (జనంసాక్షి):** మండలంలోని పాపయ్యపేట, ధర్మతండ, అమృ తండ గ్రామాలలో సెంటర్ ఫర్ పుపిల్ ఫారెస్టీ ఆధ్వర్యంలో మహిళల సాధికారత స్వయం సహకార సంఘాల మహిళలకు శిక్షణ సమావేశాలను నిర్వహించారు.ఈ సందర్భంగా ఫీల్డ్ ఫెసిలేటర్ శృతి మాట్లాడుతూ సీపీఎఫ్ ముఖ్య ఉద్దేశ్యం గ్రామాల్లో మహిళ సంఘాల బలోపేతం ద్వారా మహిళల అబివృద్ధి సాధ్యం అవుతుందన్నారు. మహిళలు ఆర్థికంగా ఎలా అభివృద్ధి సాధించాలనే అంశంపై మహిళలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎఫ్ రమేష్, సర్పంచ్ బుర్ర సుదర్శన్ గౌడ్, బోడ రవి, బోడ వీరాసింగ్, ఉప సర్పంచ్ లు లింగాల సారంగం, బాదావత్ బిక్షపతి, బోడ సంపత్, వార్డు సభ్యులు బానోతు సాలమ్మ, భూక్య రాజు, భూక్య స్వరూప, భూక్య అక్రి, బోడ నరసింహ, సబావత్ లక్ష్మి, అంగన్వా డి టీచర్లు, మహిళా సంఘాల అధ్యక్షురాల్లు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులు



**బాసర, (జనంసాక్షి):** బాసర మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. శుక్రవారం గ్రామ పంచాయతీ కార్మిక సిబ్బంది పలు కాలనీలో నీ మురికి కాలువలను శుభ్రపరి చి ప్లాస్టిక్ చెత్తాచెదారం తొలగించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ తీగల వెంకటేష్ గౌడ్, ఉప సర్పంచ్ సయ్యద్ అలీ, వార్డ్ మెంబర్లు, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ గౌడ్ లు గ్రామంలోని వీధులలో తిరిగి అక్కడి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఉన్నాయో తెలుసుకొని పారిశుద్ధ పనులను చేపట్టినట్టు వారు వెల్లడించారు.

## ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం

**హనుమకొండ ప్రతినిధి ఫిబ్రవరి 6 (జనంసాక్షి) :** దేశంలో విద్యను హక్కు నుంచి వ్యాపారంగా మార్చే ప్రయత్నాలకు వ్యతిరేకంగా ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో హన్మకొండ అంబేద్కర్ కూడలి వద్ద శుక్రవారం కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం చేయడం జరిగింది.ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఉట్కూరి ప్రణీత్ గౌడ్, భాష బోయిన సంతోష్ మాట్లాడుతూ. .కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వికసిట్ భారత్ సంకల్ప్ అభియాన్ అధికారికంగా విద్య బిల్లు కాకపోయినా, దాని పేరుతో అమలు చేయబోయే విద్యా రంగ విధానాలు విద్య ప్రైవేటీకరణకు దారితీస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.విద్యా నిధుల కోత, స్కాలర్షిప్‌ల తగ్గింపు, ప్రభుత్వ యూనివర్సిటీల నిర్లక్ష్యం, ప్రైవేటు, కార్పొరేట్ యూనివర్సిటీలకు ప్రోత్సాహం వంటి చర్యలు కలిసి ఒక "డీ ఫాక్టో విద్య బిల్లు" రూపం దాలుస్తున్నాయని వారు పేర్కొన్నారు. అందుకే దీనిని విద్యార్థి ఉద్యమంలో విద్యార్థి వ్యతిరేక బిల్ అని పిలుస్తున్నామని తెలిపారు.ప్రస్తుత కేంద్ర బడ్జెట్‌లో విద్యకు జీడీపీలో తగిన ప్రాధాన్యం ఇవ్వకపోవడం, స్కాలర్‌షిప్ పథకాల్లో కోతలు, హాస్టల్, రీసెర్చ్ ఫండ్స్ తగ్గింపుల కారణంగా ఈ బడ్జెట్‌ను విద్యావ్యతిరేఖగా సంతోష్ విమర్శించారు. ఈ విధానాల వల్ల పేద, గ్రామీణ, వెనుకబడిన వర్గాల విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతు న్నారని హెచ్చరించారు.అలాగే యూజీసీ విధానాలను బలహీనపరచే ఏ ప్రయత్నమైె నా రాజ్యాంగ విరుద్ధమని వారు స్పష్టం చేశారు. లేకుంటే ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో భవిష్యత్తులో ఆందో ళన పోరాటాలను ఉధృతం




చేస్తామని హెచ్చరిం చారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు కుక్కల కుమార్, వేల్పుల చరణ్, జక్కుల భాను ప్రసాద్, జిల్లా సహాయ కార్యదర్శి బొజ్జ జ్యోతి, జిల్లా సమితి సభ్యులు సిపతి వినయ్,యూనివర్సిటీ అధ్యక్షులు కొమ్ము సాయి, జిల్లా నాయకులు కొండ చరణ్, రమేష్, పవన్ లతోపాటు తదితరులు పాల్గొన్నారు.

## తాడిచర్లలో గ్రామ సభ

**సర్పంచ్ బండి స్వామి**



**మల్హర్,ఫిబ్రవరి 06(జనంసాక్షి):** మండల కేంద్రమైన తాడిచెర్ల లోని పంచాయతీ కార్యాలయ ఆవరణలో శుక్రవారం గ్రామ సర్పంచ్ బండి స్వామి అధ్యక్షతన గ్రామ పంచాయతీ కార్యదర్శి మల్లికార్జున్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించారు. ఈ సమావేశంలో గ్రామ అభివృద్ధి ప్రణాళికల పై చర్చించారు. విద్యాశాఖ, వైద్య, వ్యవసాయం, విద్యుత్, త్రాగు నీరు, వివిధ శాఖలపైన సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రజలకు అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉండాలి అని అన్నారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బొబ్బిలి రాజు గౌడ్, ఇందారపు చంద్రయ్య, పైడాకుల దేవేంద్ర సమ్మయ్య, తిర్రి అశోక్, ఇందారపు సారయ్య, కామ బాపు, పమ్మిడి నిరంజన్ రావు, చల్లా మహేందర్, నారమల్ల రాజేశ్వరి, కొత్తగొల్ల వనమ్మ, పర్వీన బేగం, ఇందారపు శ్యామల తదితర వార్డు సభ్యులతో పాటు వివిధ శాఖల అధికారులు, పంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## సీఎం కప్ మండల స్థాయి క్రీడలు

**గోవిందరావుపేట (జనంసాక్షి) :** మండలం కేంద్రంలో సిఎం కప్ మండల స్థాయి క్రీడలు శుక్రవారం రోజున జెడ్ పి హెచ్ గర్ల్స్ గోవిందరావుపేటలో మండల విద్యాధికారి గొంది దివాకర్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గోవిందాపేట గ్రామ సర్పంచ్ జోగా నాయక్ విచ్చేసి క్రీడా కార్యక్రమాన్ని ప్రారంభించినారు. మండల స్థాయి క్రీడా ఆటలలో కబడ్డీ,ఖో ఖో,వాలీబాల్ పోటీలు నిర్వహించి మండల స్థాయి టీములను ఎంపిక చేసి జిల్లా స్థాయికి పంపించడం జరుగుతుంది.ఈ కార్యక్రమంలో గోవిందరావుపేట గ్రామ ఉప సర్పంచ్ పెండెం శ్రీకాంత్,ఫిజికల్ డైరెక్టర్లు సమ్మయ్య,కవిత, సరిత,ఉషశ్రీ,నాగమణి, పి ఎస్ హెచ్ ఎం రఘురాం పాల్గొన్నారు.



## జనంసాక్షి క్యాలెండర్ ఆవిష్కరణ



**నడికూడ, ఫిబ్రవరి 6 (జనంసాక్షి):** హనుమకొండ జిల్లా నడికూడ మండలం రాయపర్తి గ్రామంలో శుక్రవారం రోజున గ్రామపంచాయతీ పాలకవర్గం జనం సాక్షి నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ రాజా జగత్ ప్రకాష్ మాట్లాడుతూ జనం సాక్షి దినపత్రిక ప్రజలకు మరింత చేరువై ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ చెలుమల్ల సురేందర్ రెడ్డి, వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులు మారం దేవేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సీపీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధి హామీ కూలీలకు అవగహన సదసు

### చెన్నారావుపేట ఎంపీడీవో వెంకట శివానంద్



**చెన్నారావుపేట, ఫిబ్రవరి 6(జనంసాక్షి):** మండలంలోని అక్కల్ చెడ గ్రామ పంచాయతీ పరిధిలోని హారియ నాయక్ తండాలో శుక్రవారం సెంటర్ ఫర్ పుపిల్ ఫారెస్టీ ఆధ్వర్యంలో ఉపాధి హామీ కూలీలకు అవగహన సమావేశంలో నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపిడివో వెంకట శివానంద్, గ్రామ సర్పంచ్ భూక్య బుజ్జి సురేష్‌లు హాజరై మాట్లాడారు. గ్రామాల్లో ఉపాధి హామీ పనులను చేపట్టాలన్నారు. అలాగే కూలీలకు కేటాయించిన పని దినాలదను పూర్తి చేయాలని గతంలో ప్రతి కుటుంబానికి 100 రోజుల పని దినాలు ఉండేవని ప్రస్తుతం 125 రోజులకు పెరిగిందని కూలీలు ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ కక్కెర్ల రజిత శ్రీను, పంచాయతీ కార్యదర్శి తిప్పని చేరాలు, ఉమెన్ ట్రైనర్ సౌందర్య, ఫీల్డ్ ఫెసిలేటర్ బానోత్ వీరన్న ప్రియాంక, సుప్రియ, స్వరూప, గణేష్, కీరు, గ్రామ పెద్దలు పెద్ద వీరు, పోటీయ, ఈర్య, వీరు, రాజు, శివ, రాజు, ఉపాధి హామీ కూలీలు, తదితరులు పాల్గొన్నారు.

## అధైర్య పడొద్దు, అండగా నేనున్నా

### సర్పంచ్ కొండ రాజమ్మ



**మల్హార్,ఫిబ్రవరి 06 (జనంసాక్షి):**మండలం లోని కొయ్యూరు గ్రామానికి చెందిన గుంటి సడవలి ఇటీవల అనారోగ్యము తో మృతి చెందాడు.రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు కొయ్యూరు సర్పంచ్ కొండ రాజమ్మ మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి వారికీ అధైర్యపడద్దు అండగా కాంగ్రెస్ పార్టీ ఉంది అని భరోసా కల్పించి 25కేజీ ల బియ్యం అందించారు. ఈ కార్యక్రమం లో సర్పంచ్ కొండ రాజమ్మ సమ్మయ్య, వార్డు సభ్యులు వేల్పుల సారమ్మ,యూత్ అధ్యక్షులు లకావత్ రాజేందర్, వేల్పుల వెంకటేష్, లచ్చయ్య, బాపురెడ్డి, రవీందర్, ఎల్లయ్య,కుమార్,కార్యకర్తలు పాల్గొన్నారు.

## మహబూబాబాద్ కోర్టుకు వీల్ చైర్ అందజేసిన రోటరీక్లబ్



**మహబూబాబాద్ బ్యూరో, ఫిబ్రవరి 06(జనంసాక్షి):** మహబూబాబాద్ జిల్లా కోర్టుకు రోటరీక్లబ్ ఆధ్వర్యంలో వీల్ చైర్ ను అందజేశారు. శుక్రవారం స్థానిక జిల్లా న్యాయమూర్తి మహ్మద్ అబ్దుల్ రఫీ చేతుల మీదుగా సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. రోటరీక్లబ్ అధ్యక్షులు వేమిశెట్టి కిషోర్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈకార్యక్రమంలో సీనియర్ రొటేరియన్లు వద్దుల సురేందర్ రెడ్డి, లీగల్ అడ్వైజర్ తోర్నాల నగేష్ కుమార్, బిక్కి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ట్రెజరర్ శంతన్ రామరాజు ఆర్థిక సహకారంతో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి మహ్మద్ అబ్దుల్ రఫీ మాట్లాడుతూ సమాజాభివృద్ధిలో మహబూబాబాద్ రోటరీక్లబ్ సేవలు గణనీయమైన మార్పును తీసుకొస్తున్నాయన్నారు. ప్రతిరోజూ వివిధ కేసుల్లో కోర్టుకు వచ్చే వికలాంగుల సహాయార్థం రోటరీక్లబ్ ఇస్తున్న వీల్ చైర్ ఉపయోగపడుతుందని హర్షం వెలిబుచ్చారు. నిరుపేద విద్యార్థులు, వికలాంగులు, వృద్ధులు, మహిళల కోసం రోటరీ చేస్తున్న సేవలు వెలకట్టలేనివని ప్రశంసించారు. రోటరీక్లబ్ అంటేనే ఒక నమ్మకం, ఒక ధైర్యం అని అన్నాడు. సేవాగుణానికి పర్యాయపదంగా నిలిచి ముందుకెళ్తున్న రోటరీక్లబ్ సభ్యులను పేరుపేరునా అభినందించారు. ఈ కార్యక్రమంలో రొటేరియన్లు సాధు మహిపాల్ రెడ్డి, దూదికట్ల సత్యం, అచ్చ శ్రీనివాస్, ఇమ్మడి కృష్ణమూర్తి మరియు కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఇంటింటి ప్రచారంతో ప్రజల్లోకి చల్లా ధర్మారెడ్డి



**పరకాల, ఫిబ్రవరి 6 (జనంసాక్షి):** పరకాల మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో బిఆర్ఎస్ పార్టీ ప్రచారం ఉత్సాహంగా కొనసాగుతోంది. ఈ క్రమంలో పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పట్టణంలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ ప్రజలను ప్రత్యక్షంగా కలుసుకుని బిఆర్ఎస్ అభ్యర్థులకు మద్దతు తెలుపుతూ కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, ఇచ్చిన హామీలు అమలు కాకపోవడం, అభివృద్ధి లోపాలపై ప్రజలకు వివరించారు. మున్సిపాలిటీ అభివృద్ధి, ప్రజల సంక్షేమం బిఆర్ఎస్‌తోనే సాధ్యమని స్పష్టం చేశారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో బిఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించి పట్టణ అభివృద్ధికి తోడ్పడాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఇంటింటి ప్రచార కార్యక్రమంలో పరకాల మున్సిపాలిటీ పరిధిలోని 2, 12, 13 వార్డుల బిఆర్ఎస్ అభ్యర్థులు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సీఎం కప్ వాలీబాల్ పోటీలకు ఎంపికైన గురుకుల డిగ్రీ కళాశాల విద్యార్థులు



**వరంగల్ ఈస్ట్, (జనంసాక్షి):** ఖిలావరంగల్ మండల నియోజక వర్గం స్థాయిలో జరిగినటువంటి సిఎం కప్ టోర్నమెంటులో సాంఘిక సంక్షేమ గురుకుల మహిళ డిగ్రీ వరంగల్ తూర్పు కళాశాలలోచదువుతున్నటువంటి కీర్తన బి జెడ్ సి ఫస్ట్ ఇయర్ సౌజన్య ఎం జెడ్ సి ఫస్టియర్ నియోజకవర్గం స్థాయిలో గెలుపొంది జిల్లా స్థాయికి సెలెక్ట్ అయి నందున కళాశాల ప్రిన్సిపాల్ డా .రాధిక , వైస్ ప్రిన్సిపాల్ డా. .సునిత, , ఫిజికల్ డైరెక్టర్ డా.పద్మ అధ్యా పక బృందం విద్యార్థులను అభినందించారు.వీరు ఈనెల 9వ తారీఖున ఓ సిటీ గ్రౌండ్లో జరిగే డిస్టిక్ లెవెల్ సిఎం కప్పు టోర్నమెంటులో ఎంతో ఉత్సాహంతో పాల్గొనాలని ప్రిన్సిపాల్ అన్నారు.

## ముల్కనూరు సహకార సంఘాన్ని సందర్శించిన 52 మంది నూతన అధికారులు



**భీమదేవరపలి ఫిబ్రవరి 6 (జనంసాక్షి):** ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కోఆపరేటివ్ మేనేజ్‌మెంట్ (ఐసిఎం)హైదరాబాద్ ఆధ్వర్యంలో 36 వారాల హయ్యర్ డిప్లొమా ఇన్ కోఆపరేటివ్ మేనేజ్‌మెంట్ శిక్షణ పొందుతున్న తెలంగాణ రాష్ట్ర సహకార శాఖకు చెందిన 52 మంది నూతనంగా నియమితులైన అసిస్టెంట్ రిజిస్ట్రార్లు ముల్కనూరు కోఆపరేటివ్ రూరల్ క్రెడిట్ అండ్ మార్కెటింగ్ సొసైటీని గురువారం సందర్శించారు.సహకార రంగంలో దేశవ్యాప్తంగా ఆదర్శంగా నిలుస్తున్న ముల్కనూరు సహకార సంఘం పనితీరు, నిర్వహణ విధానం, రైతులకు అందిస్తున్న ఆర్థిక సేవలు, సంక్షేమ కార్యక్రమాలను ప్రత్యక్షంగా అవగాహన చేసుకునే ఉద్దేశంతో ఈ అధ్యయన పర్యటన నిర్వహించారు.ఈ సందర్భంగా సంఘం సిబ్బంది సంఘం కార్యకలాపాలు,రుణ పంపిణీ విధానం, మార్కెటింగ్ వ్యవస్థ, రైతు ఆధారిత అభివృద్ధి కార్యక్రమాలపై శిక్షణార్థులకు విస్తృతంగా వివరించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో సంఘం అధ్యక్షులు అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి నూతన అధికారులతో పరస్పర చర్చ జరిపారు. సంఘం ఎదుర్కొంటున్న సవాళ్లు, భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికపై వివరించారు.ఈ శిక్షణ కార్యక్రమం నూతన అధికారుల భవిష్యత్ సేవలకు దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తూ వారిని అభినందించారు.

## అన్ని దానాల కన్నా రక్తదానం గొప్పది



**నేరడిగొండ ఫిబ్రవరి 6(జనంసాక్షి):** అన్ని దానలో రక్త దానం గొప్పదని తెలంగాణ రాష్ట్ర అధ్యాపకుల సంఘం ప్రధాన కార్యదర్శి బలరాం జాధవ్ అన్నారు.శుక్రవారం రోజున మండలంలోని ధార్మిక్ నగర్ గ్రామానికి చెందిన రాష్ట్ర అధ్యాపకుల సంఘం ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ జన్మదిన సందర్భంగా అభిమానులు ధార్మిక్ నగర్ ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి దాతలు, అభిమానులు,మిత్రులు పాల్గొని తనపై ఉన్న అభిమానాన్ని ప్రతి సంవత్సరము లాగానే ఈ సంవత్సరం కూడా 42 యూనిట్ల రక్త దానం చేసి తనపై ఉన్న అభిమానాన్ని మరొక్కసారి చాటుకున్నారు.ఈ సందర్భంగా బలరాం జాదవ్ మాట్లాడుతూ నాపై మీరందరూ చూపించే అభిమానం ఆప్యాయత నాపై మరింత బాధ్యతలను, ఎక్కువ సేవ చేసే విధంగా మరింత ప్రోత్సాహాన్ని ఇస్తుందని,అన్ని దానలో రక్త దానం గొప్ప దని అన్నారు.ఈ శిబిరంలో పాల్గొన్న ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## పుష్కర ఘాట్ల పరిశీలన



**ముధోల్, ఫిబ్రవరి 06 (జనంసాక్షి)** నిర్మల్ జిల్లా ముధోల్ మండల కేంద్రంలోని అష్ట గ్రామంలో 2027 సంవత్సరంలో జరగబోయే పుష్కరాలకై జిల్లా కలెక్టర్ ఆదేశాలనుసారంగా శుక్రవారం తాసిల్దార్ శ్రీలత పుష్కర ఘాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏఈఆర్ డబ్ల్యు ఎస్ హరిచందన, ఆర్ఐ నారాయణరావు పాటిల్, గ్రామస్తులు ఉన్నారు.

# ఇందిరమ్మ రాజ్యంలోనే ప్రజల బతుకులు బాగుపడతాయి

- పదేండ్లు టిఆర్ఎస్ చేసింది శూన్యం
- అధికార పార్టీ అభ్యర్థులు గెలుస్తేనే పరకాల అభివృద్ధి సాధ్యం
- పరకాల నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మాదాసి శ్రీధర్



**ఆత్మకూరు, ఫిబ్రవరి 6 (జనం సాక్షి):** ఇందిరమ్మ రాజ్యంలో మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించుకుంటేనే పేదల బతుకులు బాగుపడతాయని పరకాల నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మాదాసి శ్రీధర్ అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి ఆదేశాల మేరకు పరకాల మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో యూత్ కాంగ్రెస్ నాయకులు కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు కొరకు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అనంతరం పరకాల నియోజకవర్గ అధ్యక్షుడు మాదాసి శ్రీధర్ మాట్లాడుతూ పదేళ్ల బి ఆర్ఎస్ కాలంలో పరకాలను అన్ని రంగాల్లో దోచుకున్నారే తప్ప ప్రజలకు అవసరమైన పనులు చేసింది శూన్యం అన్నారు. ప్రజా ప్రభుత్వంలో ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి 2సంవత్సరాలలోనే పరకాల పట్టణ కేంద్రంలో 75 కోట్ల నిధులను తెచ్చి పరకాల పట్టణ కేంద్రంలో ప్రభుత్వ ఆసుపత్రి, ప్రభుత్వ డిగ్రీ కాలేజ్,ఆడవాడలా సీసీ రోడ్లు,డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేసి, ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ విద్యార్థులకు మెరుగైన విద్యను అందించడానికి ఇంటిగ్రేటెడ్ పాఠశాలను మంజూరు చేసిన ఘనత ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి దని అన్నారు. అందుకోసం రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించుకుంటే పరకాలను ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి మరింత అభివృద్ధి చేసి రూపురేఖలు మారుస్తారని అన్నారు. ప్రజలు బి ఆర్ఎస్ నాయకులు చెప్పిన మాటలు నమ్మి మోసపోకుండా చేయి గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన ప్రజలకు కోరారు. ఈ యొక్క ప్రచార కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు పర్వతగిరి,యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్యామ్, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి అల్లం శ్రీరామ్,ఆత్మకూరు మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు తనుగుల సందీప్,దామెర అధ్యక్షులు నల్ల సుధాకర్, నడికూడా అధ్యక్షులు అప్పం కుమారస్వామి, పరకాల అధ్యక్షుడు కృష్ణకాంత్, ఉపాధ్యక్షులు సిలువేరు రాఘవ, దామెర రతన్, ముఖ్య నాయకులు వెంకటేష్,రాజు తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణిలో స్కీంలు పోయి స్కాంలొచ్చే

రంగాలలో అభివృద్ధి చెందాలంటే కూటమి అభ్యర్థులను బారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కలవేన శంకర్, బిఆర్ఎస్ ఎన్నికల ఇంచార్జ్ పల్లె భూమేష్, నాయకులు రాజరమేష్, రామడుగు లక్ష్మణ్, సుదర్శన్ గౌడ్, మిట్టపల్లి శ్రీనివాస్, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

# నిర్మల్ అభివృద్ధికి బీజేపీ అభ్యర్థులను గెలిపించండి

**ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి**



నిర్మల్ బ్యూరో, ఫిబ్రవరి06,(జనంసాక్షి) నిర్మల్ పట్టణం అభివృద్ధి చెందాలంటే మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని ఎమ్మెల్యే మహేశ్వరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం ప్రచారంలో భాగంగా నిర్మల్ పట్టణంలోని పలు కాలనీల్లో అయన ఇంటింటి ఎన్నికల ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గాంధీచౌక్, సోమవార్ పేట్, బెస్తవార్ పేట్ ప్రాంతాల్లో స్థానిక ప్రజలను కలుసుకుని బీజేపీ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో 24వ వార్డు అభ్యర్థిగా ఒడిసెల లక్ష్మిని, 25వ వార్డు అభ్యర్థిగా ఏడిపెల్లి నరేందర్ ని భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. బీజేపీ అభ్యర్థుల విజయమే నిర్మల్ పట్టణ అభివృద్ధికి మార్గం అని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, భారతీయ జనతా పార్టీని ఒంటరిగా ఎదుర్కొనే దమ్ము లేక బీఆర్ఎస్, కాంగ్రెస్, ఎంఐఎం పార్టీలు ఏకం కావడానికి సిద్ధమవుతున్నాయని విమర్శించారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి, ధర్మానికి అండగా నిలిచి బీజేపీకి ఓటు వేయాలని ఆయన పిలుపునిచ్చారు. నిర్మల్ పట్టణాన్ని కాపాడుకోవాలంటే, అభివృద్ధి మరియు పారదర్శక పాలన కోసం బీజేపీ అభ్యర్థులను గెలిపించాల్సిన అవసరం ఉందని అన్నారు. రానున్న రోజుల్లో నిర్మల్‌ను మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రజల మద్దతు కీలకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా, పట్టణ బీజేపీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రచారాన్ని విజయవంతం చేశారు.



# పెస్టిసైడ్స్ దుకాణాలను తనిఖీ ఏవో శ్రీజ

**మహదేవపూర్ ఫిబ్రవరి 6 (జనంసాక్షి)** : మహదేవపూర్ మండల కేంద్రంలో నకిలీ పురుగు మందుల విక్రయాలపై రైతులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మాదే పూర్ మండల కేంద్రంలోని త్రిలోక్ష పెస్టిసైడ్స్ దుకాణాన్ని వ్యవసాయ అధికారిని శ్రీజ తనిఖీ చేపట్టారు. శుక్రవారం ఎరువుల పురుగుమందుల దుకాణంలోని రికార్డులను స్టాక్ రిజిస్టర్ ను పరిశీలించారు. అందులో నమోదు కాని కొన్ని పురుగు మందులను విక్రయాలు చేస్తున్నందున 4 లక్షల 34 వేల విలువగల క్రిమిసంహారక మందులూ తాత్కాలికంగా విక్రయాలు నిలిపివేస్తూ తగు విచారణ జరిపిన తరువాతనే క్రయవిక్రయాలను జరపాలని స్టాక్ సేల్ ఇవ్వడం జరిగిందని వ్యవసాయ అధికారిని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ విస్తీర్ణ అధికారులు ధర్మేందర్ రచన శరత్ పాల్గొన్నారు.

# క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

**కౌటాల ఫిబ్రవరి 06 (జనంసాక్షి) :** మండలంలోని పార్డి గ్రామం లో శుక్రవారం క్రికెట్ టోర్నమెంట్ ను కౌటాల ఎస్ ఐ చంద్రశేఖర్ తో కలిసి, పార్డి గ్రామ సర్పంచ్ మడావి చందు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ఆన్లైన్ ల గేమ్ ల కంటే క్రికెట్ క్రీడల టోర్నమెంట్ నిర్వహించుకొవాలని , క్రిడల వల్ల మానసిక ఉల్లాసం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమం లో సర్పంచ్ లు సత్తయ్య,సంతోష్, అనిల్ బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు మోతిరాం, మాజీ సర్పంచ్ కస్తూరి సత్యనారాయణ, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.



# బిఆర్ఎస్ కార్పొరేటర్ అభ్యర్థులను గెలిపించండి



**మాజీ మంత్రి హరీష్ రావు**

నస్పూర్(జనంసాక్షి):మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ అన్ని డివిజన్ లలో బిఆర్ఎస్ కార్పొరేటర్ అభ్యర్థులను గెలిపించాలని మాజీ మంత్రి హరీష్ రావు పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం రోజున నస్పూర్ లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో కష్టపడి ఎందరో త్యాగాల మీద తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని అన్నారు. మంచిర్యాల్ పట్టణ ప్రజల ఎన్నో సంవత్సరాల కళ అయినా మంచిర్యాల జిల్లాను ఏర్పాటు చేసింది కేసీఆర్ అని పేర్కొన్నారు. జిల్లా అయిన తర్వాత కలెక్టరేట్,మెడికల్ కాలేజ్ ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేశామని అవి ఇప్పటి ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని తెలిపారు. సింగరేణి కార్మికుల పిల్లలకు మెడికల్ బోర్డు ద్వారా 15,600 ఉద్యోగాలు ఇచ్చింది కేసీఆర్ అని పేర్కొన్నారు. శ్రీరాంపూర్ ఏరియాలో సింగరేణి స్థలంలో నివసించే వారికి 3200 పట్టాలు ఇచ్చామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత మెడికల్ బోర్డు నిర్వహించడం లేదని ఉద్యోగాలు ఇవ్వడం లేదని తెలియజేశారు. రాష్ట్రాన్ని రేవంత్ రెడ్డి నాశనం చేస్తున్నాడని విమర్శించాడు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం సింగరేణి కార్మికుల ఇన్కమ్ టాక్స్ రద్దు చేసిన తర్వాతే బిజెపి నాయకులు ఓట్లు అడగాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు నడిపెల్లి దివాకర్ రావు,బాల్క సుమన్,నస్పూర్ బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అక్కురు సుబ్బయ్య,నాయకులు విజిత్ రావు,టీబీజీకేఎస్ నాయకులు మిర్యాల రాజిరెడ్డి,కేతిరెడ్డి సురేందర్ రెడ్డి,కార్పొరేటర్ అభ్యర్థులు,నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నిరుపేదలకు అండగా నిలిచిన శ్రేష్ట్ ఫౌండేషన్...



**గూడూరు, ఫిబ్రవరి 7 (జనంసాక్షి) :** శ్రేష్ట్ పౌండేషన్ వ్యవస్థాపకులు విక్రమ్ గౌడ్ సహకారంతో శుక్రవారం మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం గుండెంగా గ్రామంలో నిరుపేద పిల్లలను,క్యాన్సర్ బాధపడుతుండగా భూక్య భద్రు నాయక్ వారికీ అండగా నిలిచారు. అనంతరం క్యాన్సర్ బాధితులకు ఒక్కొక్కరికి 10000వేల రూ,,లతో పాటు పాలు, పండ్లు పంపిణి చేశారు. ఈసందర్భంగా భూక్య భద్రు నాయక్ మాట్లాడుతూ హైదరాబాద్‌కు చెందిన మాజీ మంత్రి ముఖేష్ గౌడ్,ఆయన కుమారుడు విక్రమ్ గౌడ్ ఆధ్వర్యంలోని శ్రేష్ట్ ఫౌండేషన్ పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తోందని,వారుప్రధానంగా పండ్ల పంపిణీ,కొంత ఆర్థిక సహాయం అందిస్తున్నారని,ముఖేష్ గౌడ్ జన్మదినం జులై 1న,లేదా వర్ధంతి (జులై 29)సందర్భంగా ఆసుపత్రుల్లో రోగులకు పండ్లు,బ్రెడ్ పంపిణీ చేయడం ఆనవాయితీగా వస్తోందని,'శ్రేష్ట్ ఫౌండేషన్' ఆధ్వర్యంలో ముఖేష్ గౌడ్ మెమోరియల్ మల్లయుద్ధం(కుస్తీ) పోటీలను విక్రమ్ గౌడ్ ప్రతి సంవత్సరం ఎల్‌బి స్టేడియంలో ఘనంగా నిర్వహిస్తారనిఅన్నారు. కార్యక్రమంలో బోడ రాజారాం,బోడ లాలు,తదితరులు పాల్గొన్నారు.

# మహిళా ఆరోగ్య సహాయకులకు శిక్షణ



**నిర్మల్ బ్యూరో, ఫిబ్రవరి 6 (జనంసాక్షి)** :జిల్లాలో మహిళా ఆరోగ్య సహాయకులకు ఇంటిగ్రేటెడ్ హై రిస్క్ ప్రెగ్నెన్సీ ట్రాకింగ్ అండ్ మేనేజ్‌మెంట్‌పై రెండు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. నిర్మల్ పట్టణంలోని పదవీ విరమణ ఉద్యోగుల సంఘ భవనంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రాజేందర్ పాల్గొని గర్భధారణలో వచ్చే జ్వరం, రక్తస్రావం, పిండం కదలికలు తగ్గడం, హెచ్ఐవి వంటి ప్రమాదకర పరిస్థితులను ముందుగానే గుర్తించి నివారణ చర్యలు చేపట్టాల్సిన అవసరాన్ని వివరించారు. హార్మోన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో డాక్టర్ చరణ్, డాక్టర్ విద్యాసాగర్ శిక్షణ నిర్వహించగా, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ఆకాష్, డాక్టర్ సౌమ్య, పీహెచ్ఎన్ఓ సాయమ్మతో పాటు జిల్లాలోని మహిళా ఆరోగ్య సహాయకులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలి

**మాజీ ఎమ్మెల్యే సతీమణి ఫాతిమా మేరీ**

**స్టేషన్ ఘన్ పూర్, ఫిబ్రవరి 06 (జనం సాక్షి) :** స్టేషన్ఘన్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని13వవార్డు లో కాంగ్రెస్ అభ్యర్థి మారేపల్లి ప్రసాద్ బాబు కారు గుర్తుకు ఓటు వేయాలని ఇంటింటా ప్రచారంనిర్వ హించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజ య్య సతీమణి ఫాతిమా మేరీ మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వం లో జరిగిన అభివృద్ధి తప్ప కాంగ్రెస్ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి ఏమీ లేదని అన్నారు. యువ నాయకుడు మారేపల్లి ప్రసాద్ కారు గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజా ర్టీతో గెలిపించాలని కోరారు. మాజీ ఎంపీపీ చిట్ల జయశ్రీ, ఆకారపు అశోక్, చింత శ్రీనివాస్, తదిత రులు పాల్గొన్నారు.